# భానువారము

శ్రీ ఆరణితోట చెంగల్వరామం, చెన్నై.

ఆదివారమని మనం అలవాటుగా చెప్పుకునే దినమే భానువారము. భానువారము సూర్యభగవానుని పవిత్ర దినము. భానుడు అంటే సూర్యుడు కాబట్టి మనము భానువారమని చెప్పుకున్న బాగుండును. సూర్య దేవునికి సహస్ర నామములున్నవి. వానిలో కొన్ని మనకు అలవాటులో వున్నవి. ప్రభాకరుడు, దివాకరుడు, అర్కదేవుడు, ఆదిత్యుడు, భాస్కరుడు, రవి మొదలగునవి ఎన్నో, ఎన్నెన్నో వున్నవి.

ఆదివారమనగా ఆది అనగా మొదటిది. వారములలో మొట్టమొదటి దినమే కావున మనము ఆదివారమని చెప్పుకొనుచున్నాము. హిందీ భాషలో రవివార్ అంటారు. రవి అనగా సూర్యుడు. కాబట్టి రవివార్ అంటారు. అటులనే ఇంగ్లీషులో సన్ అంటే సూర్యుడు. కాన సన్‌డే అంటారు. తమిళములో జ్ఞాయిర్ అంటేసూర్యుడు. కనుకతమిళులు జ్ఞాయిట్రు కిరమై అంటారు. కాబట్టి అందరివలె మనము భానువారమని చెప్పుకొనిన చాలా బాగుండును.

భానువారముయొక్క ప్రత్యేకత ఏమనగా భానుడుదయించకపోతే ప్రపంచమంతయు అంధకారమై యుండును. సూర్య భగవానుడు వస్తున్నాడని తెల్సుకొని అతను రాను సుమారు ఒకగంట ముందుగానే చీకటి భయపడి మనకు తెలియ కుండానే పారిపోయి దాక్కుంటున్నది. సూర్యదేవుని వలననే వర్షములు వర్షించు చున్నవి. మనకు జీవులకు త్రాగుటకు జలము లభించుచున్నది. పంటలు పండని ఎడల మనమే కాదు సమస్త జీవులు కూడ జీవించజాలవు. మన జీవన విధానమునకు ప్రధానము సూర్య భగవానుడు.



నవగ్రహములలోనూ సూర్య భగవానుడే మొదటి వాడు.

ఆదిదేవ నమస్తుభ్యం, ప్రసీద మమ భాస్కర
దివాకర నమస్తుభ్యం, ప్రభాకర నమోస్తుతే.

ఈ శ్లోకము సూర్యాష్టకములో మొట్ట మొదటిది. ఈ శ్లోకములోనూ ఆదిదేవయని ప్రారంభమౌతున్నది. ఆదిదేవ అంటే మొదటి దేవుడు నీవేనని అర్థం. కావున మనము ఆ రోజు పవిత్ర దినముగా భావించి భక్తి శ్రద్ధలతో, సూర్య దేవుని స్తుతించి, వ్రతములు, పూజలు, ఉపవాసములు, శాస్త్రోక్తముగా జరుపుకున్న ఎడల పుట్టుట, గిట్టుట, మనకు కలుగనే కలుగవు. సకల భోగ భాగ్యములనుభవించి తుదకు కైవల్యమును కూడ చేరగలము.

రథ సప్తమి సూర్యదేవుని పండుగలలో ప్రధానమైనది. మాఘ మాసంలో శుద్ధ సప్తమి రోజు రథ సప్తమి వస్తుంది. సప్తమి అనగా ఏడు. సూర్యదేవుని రథమునకు గుర్రములు ఏడు. ఇంద్ర ధనుస్సుకి రంగులు ఏడే. మరియు సప్త

ఋషులు, సప్త వారములు, సప్త స్వరములు, సప్త లోకాలు, మన శరీరంలో వున్న చక్రాలు ఏడు, బ్రహ్మాండములో లోకాలు ఏడు, పిండాం డములో చక్రాలు ఏడు, గాయత్రీ మహా మంత్రములో వ్యాహృతులు ఏడు, సప్తగిరులు, సప్త సముద్రములు, సప్త ద్వీపములు, ఈ విధంగా ఇంకను ఎన్నో, ఎన్నెన్నో కలవు. సప్తమికి అంత ప్రాముఖ్యత వున్నది. రథసప్తమి ఆ సప్తమిలో చేరినదే. భాను వారసప్తమి కూడా పవిత్రమైన రోజే.

మనము ప్రత్యక్షముగా చూచు దైవమే సూర్యభగవంతుడు. ఈ సమస్త చరాచర ప్రపంచము సూర్యదేవునిపై ఆధారపడివున్నది. అందుకే ఆదికాలము నుండి మన పూర్వీకులు, భగవంతుని రూపంలో ఆదిత్యుని ఆరాధించు చున్నారు. మనలో ఎందరు ప్రాతః కాలమున సూర్య నమస్కారము చేయుచున్నారు. సూర్య నమస్కారములు చేయనిదే కొందరు పచ్చి గంగను కూడా త్రాగరు. త్రికాలము సూర్య నమస్కారములు చేయువారున్నారు. సూర్యోపాసకు లున్నారు.

మరి శాస్త్ర ప్రకారము భానువారము చేయవలసిన పనివేరు. ఆదిత్యుని ఉపాసన దినం. ఆ రోజు చాలా పవిత్రమైనది. అందుకని మధువు, వధువు, మాంసము, తైలస్నానములు నిషేధము. ఇవి పాటించు వారికి అష్టైశ్వర్యములు (సకల శుభములు) కలుగును. లేనిచో రోగపీడితులై, దారిద్ర్యమును, సప్త జన్మముల వరకు అనుభవించి తీరవలసినదేనని శాస్త్రములు శాసించుచున్నవి.

అమిషం మధుపానంచ,
యః కరోతి రవేర్దినే
సప్త జన్మ భవేద్రోగీ,
జన్మ జన్మ దరిద్రతాః
స్త్రీ తైల మధుమాంసాని,
యేత్య జన్తిరవేర్దినే
నవ్యాధిశోక దారిద్ర్యం
సూర్య లోకంచ గచ్ఛతి.

భానువారము వివాహాది శుభ కార్యములు ఎక్కువగా చేయు చున్నారు. కారణమేమనగా ఆ రోజు శెలవు దినము. కావున పై కార్యములకు ఉద్యోగులందరు ఉత్సాహముగా రాను వీలు కలగుతుంది. ఆ రోజు మందిరములకు పోవువారధికము. ఆదివారము అమా వాస్య వచ్చిన ఆ దినము పవిత్రమైనదిగా భావించి పిల్లలకు విభూది మంత్రించడం, రక్షలు కట్టడం, దిష్టి తీయడం, గుమ్మడి కాయలు కొట్టడం, ఆదివారమునకే ప్రాధాన్యత ఇచ్చి వున్నారు. అటువంటి పవిత్రమైన దినమే ఆదివారము (భాను వారము).

భానువారము సూర్యదేవుని దినము. కావున సూర్యహోర కూడ మంచిదే. కారణమేమనగా భానువార వివాహాది శుభకార్యములు చేయుచున్నారు. గృహప్రవేశములు చేయు చున్నారు. సూర్య హోరలో కూడ పెండ్లి లగ్నములు పెట్టి పెండ్లిండ్లు ఎన్నో చేసి వున్నారు. వారందరు సంతానముతోను, సంపదలతోను, సంసా రములు సుఖముగా చేయుచున్నారు. సూర్య దేవుడు సంపదలిచ్చు భగవంతుడు. సత్రా జిత్తు మహారాజునకు సూర్యదేవుడు శమంతక మణినిచ్చి నిత్యైశ్వర్యములు కలుగజేసెను.

ఆదివారము ఆనందము నిచ్చు దినము. ఎట్లనగా ఆ రోజు శెలవు దినము. కనుక ఇంటిలో భార్యాబిడ్డలతో ఆనం దముగా కాలము గడుపుతున్నాము. బంధువులను రమ్మని కబురు పంపిన ఆదివారము శెలవుదినమని ఆ దినమే వచ్చు చున్నారు. ఉద్యోగస్తులు, ఆ రోజు మిత్రుల వద్దకు దేవాలయములకు, సినిమాలకు, విహార యాత్రలకు, విశేషముగా పోవు చున్నారు. పోవుటకు వీలు కలుగుచున్నది.

సూర్యదేవుడు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల త్రిమూర్తి స్వరూపము.

బ్రహ్మస్వరూపముదయే, మధ్యాహ్నేతు మహేశ్వరమ్
సాయంకాలం సదా విష్ణుః త్రిమూర్తిశ్చ దివాకరః.

అని శాస్త్రములు ఘోషించుచున్నవి. మనకు తక్కిన (మిగతా) దేవుళ్ళు కన్పించక పోయినా, సూర్యదేవుడు దూరంగా వుండి మనకు కన్పించుచున్నాడు. కాబట్టి సూర్య దేవుడే ప్రత్యక్ష దైవము. ఆ కారణముగా మనవారు, ఆది కాలమునుండి సూర్యా రాధన, సూర్యోపాసన విధిగా చేయు చున్నారు. కాబట్టి మనము భాను వారము సాత్త్వికాహారము భుజించి వినాయక చవితి, సంక్రాంతి మొదలగు పండుగలవలె భక్తి శ్రద్ధలతో సూర్యదేవుని పూజించి, తరించ వలెను.

భుక్తి ముక్తి నిచ్చి పోషించు దైవమై
ఆపదలను బాపి అనుదినమ్ము
బ్రోచు వాడ వనుచు పూనిన భక్తితో
సూర్యదేవ మదిని స్తుతి నొనర్తు.

